## ప్రతి కార్మికుడు ఐక్యంగా కృషి చేయాలి




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## నారాయణపూర్ కుడికాలువను పూర్తి చేస్తాం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 228 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 11 ఆగస్టు 2026





# మాజీరాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

**- ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ ఆవిష్కరించిన మోడీ**

**న్యూఢిల్లీ,ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గదర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని మిగతా2లో...

# డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లు

**మిలర్ల బ్లాక్‌మెయిల్‌ను ఎట్టి పరిస్థితిలో సహించం**

**డిఫాలర్ల మిల్లులను మహిళలకు అప్పగించాలి**

**పౌరసరఫరాల శాఖ సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం**




**హైదరాబాద్,ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** సివిల్ సప్లయిస్ శాఖలో డిఫాల్ట్ అయిన రైస్‌మిల్లర్ల నుంచి బకాయిలను వసూల్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉద్దేశ పూర్వకంగా డిఫాల్ట్ అయి బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకొని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. బకాయిల వసూళ్లకు ఒక విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. కేబినెట్ సబ్‌కమిటీలో దీనిపైన చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బకాయిల వసూళ్లే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండాలని మార్గనిర్దేశంచేశారు. మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించనని హెచ్చరించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో సివిల్ సప్లయిస్ శాఖపై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. మార్కెట్‌లో ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశిరచారు. మిగతా2లో...



# నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

**వాటాల్లో బిఆర్‌ఎస్ వల్లే తెలంగాణకు నష్టం**

**అసత్యాలను ప్రచారం చేయడం అలవాటు చేసుకున్న కెటిఆర్**

**మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీపడబోమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో మిగతా2లో...

# తెలంగాణ పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి

**- ఇళ్ల కేటాయింపులో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వండి**


**- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌కు పొంగులేటి వినతి**




# చర్చకు నేను సిద్ధం.. అన్ని ప్రశ్నలకూ సమాధానమిస్తా: అమిత్‌షా



**న్యూఢిల్లీ,ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** పార్లమెంట్‌లో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానన్నారు. పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు.. 24 గంటల పాటు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. చర్చ జరపాలని ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ రాస్తే.. చర్చ జరపడానికి ప్రభుత్వం మిగతా2లో...




# ఎన్డీఎస్ఏ సూచనల మేరకే మేడిగడ్డ పునరుద్ధరణ

**- గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుపై కన్సల్టెన్సీ నియామకం**

**- ప్రాజెక్టుల పరిహారం.. పునరావాసం వేగవంతం**

**- గరిష్ట స్థాయిలో గోదావరి జలాల వినియోగం..నీటి పారుదల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**

# రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

**మేం టి హబ్‌ను తెస్తే..**

**వారు అనుముల హబ్స్‌తో దోపిడీ**

**మరోమారు ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు**



**హైదరాబాద్,ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టి హబ్‌ను 'ను నిర్మిస్తే... మిగతా2లో...

# టాటా సన్స్ ఛైర్మన్ పదవికి చంద్రశేఖరన్ రాజీనామా

**- ఆరు నెలల ముందే తప్పకున్న చంద్రశేఖరన్**



**న్యూఢిల్లీ,ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** టాటా సన్స్ చైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా చేశారు. ఈ సంస్థ చైర్మన్ పదవిని తాను మరోసారి కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఆగస్టు 18వ తేదీన ఆ సంస్థ సర్వసభ్య సమావేశం జరగనుంది. అందుకు కొద్ది రోజుల ముందు చంద్రశేఖరన్

మిగతా2లో...

# జింబాబ్వేలో ఘోర ప్రమాదం..

**- పడవ బోల్తాపడి 44 మంది దుర్మరణం**



**హరారే:ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** జింబాబ్వేలోని కరీబా సరస్సులో ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న పడవ ఒక్కసారిగా బోల్తా పడటంతో సుమారు 44 మంది మృతి చెందారు. పలువురి జాడ గల్లంతైంది. 67 మందిని సహాయక సిబ్బంది కాపాడింది.

మిగతా2లో...

# చర్చకు నేను సిద్ధం.. అన్ని ప్రశ్నలకూ సమాధానమిస్తా: అమిత్‌షా

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధంగా ఉందని అన్నారు. బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అమిత్ షా మీడియాతో మాట్లాడుతూ.. 'సమావేశాలు మొదలైన నాటినుంచి పార్లమెంట్‌కు వస్తున్నాను. నా ఛాంబర్‌లో కూర్చుంటున్నాను. పార్లమెంట్ కార్యక్రమాలు సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటుంటే.. ఎవరైనా ఏం చేస్తారు?. వాళ్లు చర్చ జరగడానికి అంగీకరించరు. దీన్ని బట్టి ఎవరు పారిపోతున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారని అన్నారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు.అమిత్‌షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'విద్యార్థులపై లాఠీచార్జ్ ఎవరు చేశారు. కాల్పులకు ఆదేశించింది ఎవరు?. 20 రోజులుగా అమిత్‌షా ఎందుకు మాట్లాడలేదు. పార్లమెంట్ ముగిసే సమయానికి అమిత్‌షా డ్రామాలు ఆడుతున్నారు' అంటూ రాహుల్ మండిపడ్డారు.

# నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరవుతామని తెలిపారు. నీటీ వాటాపై బలంగా కొట్లాడుతామని పేర్కొన్నారు. అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్ ఫాం హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధర ఎంతో చెప్పాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. తాము కోటిన్నర రూపాయిలకు ఇచ్చిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 90 లక్షలకే ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల మేరకే భూ కేటాయింపులు జరిగాయని ఆయన వివరించారు. 5 ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పారు. కేటీఆర్ చెబుతున్న రూ. 200 కోట్లు ఎక్కడివో చెప్పాలని నిలదీశారు. హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలను భయపెట్టడం కేటీఆర్‌కు మంచిది కాదని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడికి హితవు పలికారు. రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పిన శ్రీధర్‌బాబు.. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్‌కు మంత్రి సూచించారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని.. పారిశ్రామికవేత్త లను భయపెట్టడం, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్‌బాబు వెల్లడించారు. తమపై ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజలపై చూపవద్దని ఆయనకు సూచించారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేద పేర్కొన్నారు. అందుకే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

# తెలంగాణ పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి

**న్యూఢిల్లీ,ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద తెలంగాణ రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి . రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా పొంగులేటి గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు పక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్ 2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు పక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ ఉందని తెలిపారు. ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బ్జడెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాలని పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా రాష్ట్రానికి వచ్చి ఖఓంజ-ఉ 2.0 కింద ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు.

అది చరిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్?2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు పక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందన్నారు.

తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ పేరుకుపోయినందున, ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. ఇకపోతే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని, అది చారిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు.

# ఎన్డీఎస్ఏ సూచనల మేరకే మేడిగడ్డ పునరుద్ధరణ

**హైదరాబాద్,ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీటి నిల్వ చేయడంతో పాటు పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు బ్యారేజీల్లో తేలిన సాంకేతిక లోపాలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సీఎంకు వివరించిన సందర్భంలో సీఎం మాట్లాడుతూ.. సొంత నిర్ణయాలు తీసుకుకోకుండా నిపుణుల సలహా మేరకే ముందుకెళ్లాలని వారికి సూచించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అందుబాటులో ఉన్న గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించు కోవాలని ఆదేశించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే వాటి పరిష్కారంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీఎం సూచించారు.

గోదావరి జలాలు సముద్రంలో కలవకుండా సాధ్యమైనంత వరకు ఎత్తి పోసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ ఏడాది సాగు, తాగు నీరుకు ఇబ్బందులు లేకుండా నీటి పారుదల శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలన్నారు.

రాష్ట్రంలో చివరి దశలో ఉన్న పలు ప్రాజెక్టుల కింద కొన్ని గ్రామాలు, కొద్ది పాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులు, ఆస్తులు కోల్పోయిన ప్రజలకు పరిహారం చెల్లింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు వాస్తవ పరిస్థితి, పరిహారం, పునరావాసానికి సంబంధించి నివేదిక రూపొందించాలన్నారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సూచించారు. హుస్నాబాద్ నియోజక వర్గంలోని బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిన చిన్న చిన్న పనులు పూర్తి చేస్తే నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల పథకం సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సేకరించాల్సిన భూమి, పరిహారం, ఇతర అంశాలపై నివేదిక రూపొందించాలన్నారు. గూడెందొడ్డి పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్ ను నియమించాలని ఆదేశించారు.

కన్సెల్టెంట్ నియామకంలో నైపుణ్యం, గత చరిత్రను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేయాలన్నారు. గోదావరి, కృష్ణా బేసిన్లలోని ఆయకట్టు కింద ఉన్న రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మాజీ రాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక దిశలో రామ్‌నాథ్ గొప్ప కృషి చేశారని, ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. 'నాకు కోవింద్ చాలా కాలంగా తెలుసు. ఆయన సామర్థ్యాలను నేను సుదీర్ఘకాలంగా తెలుసుకునే అవకాశం లభించింది. రాష్ట్రపతి పదవిలో ఉన్న సమయంలో కోవింద్ ఇచ్చిన సూచనలు, చూపిన ప్రత్యేకమైన ఆప్యాయత నాకు ఎంతో విలువైన ఆస్తిగా నిలిచాయి. ఆయన జీవిత అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్ల నుంచి దేశ యువత ఎంతో నేర్చుకోవచ్చు. ఆయన ఆలోచనలు, అనుభవాలను కొత్త తరం తెలుసుకోవాలి. పుస్తకానికి ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ అనే పేరు పెట్టడం ఎంతో సముచితం. కోవింద్ జీవితంలో ఎదురైన పోరాటాలు వ్యక్తిగతమైనవే కానీ. వాటి ఫలితంగా సాధించిన విజయం మాత్రం భారత గణతంత్రానికి, దేశ ప్రజాస్వామ్యానికే చెందుతుందన్న సందేశం ఈ శీర్షికలో ఉంది' అని ప్రధాని మోదీ అన్నారు.

## టాటా సన్స్ ఛైర్మన్ పదవికి చంద్రశేఖరన్ రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

రాజీనామా చేయడం ప్రాముఖ్యత సంతరించుకుంది. టాటా గ్రూప్‌లో తాను 40 ఏళ్ల పాటు వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నానని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థకు సేవలందించడం ద్వారా సంతృప్తికరమైన అవకాశం లభించిందన్నారు. అందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత దశాబ్ద కాలంగా టాటా సన్స్‌కు నాయకత్వం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇది అపారమైన బాధ్యత అని అభివర్ణించారు. వారసత్వంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా టాటా బోర్డుకు ఆయన విజ్ఞప్తి చేశారు. 2027, ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఆయన పదవి కాలం ఉంది. కానీ కొన్ని నెలల ముందే ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో టాటా సంస్థ షేర్లు దాదాపు 5 శాతం మేర పడిపోయాయి.గతంలో చంద్రశేఖరన్ టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేశారు. 2017లో టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ నియమితులయ్యారు. నాటి నుంచి ఆయన అదే పదవిలో కొనసాగుతున్నారు. అయితే ఈ సంస్థ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్‌ను మళ్లీ నియమించడంపై టాటా సన్స్, టాటా ట్రస్ట్ మధ్య వివాదం నెలకొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేశారని తెలుస్తోంది. టాటా గ్రూప్ సంస్థలో స్టీల్, మోటర్స్, టీసీఎస్, ఇండియన్ హోటల్స్ ఉన్నాయి. ఎన్ చంద్రశేఖరన్ ఇప్పటి వరకు వీటికి ఛైర్మన్‌గా వ్యవహరించారు.

## జింబాబ్వేలో ఘోర ప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

అమ్ముడయిన టిక్కెట్ల ఆధారంగా ప్రమాద సమయంలో ఐదుగురు సిబ్బందితో సహా 114 మంది ప్రయాణిస్తున్నట్టు తెలిసిందని, టిక్కెట్ల ఏజ్‌కు దిగువనున్న పిల్లల సంఖ్య తెలియాల్సి ఉందని జింబాబ్వే ప్రొటక్షన్ యూనిట్ ఒక ప్రకటనలో తెలిపింది.కాగా, పడవ సామర్థ్యం 90 మందికే సరిపోతుందని, ఎక్కువ మందిని ఎక్కించుకోవలడం వల్ల ప్రమాదం జరిగినట్టు అనుమానిస్తున్నామని జాతీయ విపత్తుల నిర్వహణ ఏజెన్సీ తెలిపింది. ప్రస్తుతం గల్లంతైన ప్రయాణికుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు జరుగుతున్నాయి. ప్రమాదానికి స్పష్టమైన కారణాలు, గల్లంతైన వారి సంఖ్యపై స్పష్టత రావాల్సి ఉందని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. జింబాబ్వే-జాంబియా సరిహద్దులో కరీబా సరస్సు ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజలు కరీబా పట్టణానికి వెళ్లేందుకు పడవలు ఉపయోగిస్తుంటారు.

## కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ,ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):**

కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా కేరళంగా మార్చే పక్రియలో మరో కీలక అడుగు పడింది. కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ బిల్లు ఆమోదం పొందింది. 'కేరళ బిల్లు-2026'ను లోక్‌సభ మంగళవారం ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించింది. రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని కోరుతూ కేరళ శాసనసభ 2024లో తీర్మానం చేసింది. మలయాళంలో రాష్ట్రాన్ని సాధారణంగా 'కేరళం'గా పిలుస్తుండగా, రాజ్యాంగంలోని అధికారిక పేరు మాత్రం 'కేరళ' అనే కొనసాగుతోంది.

## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీ-రన్.. ఫ్యామిలీ-డ్రైవ్.. జీరో ఇన్నోవేషన్.. జీరో ఎంఎ÷-లాయీస్ స్కామ్ అంటూ ఆరోపించారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకోవచ్చంటూ సెటైర్ విసిరారు. 'సున్నా పెట్టుబడితో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల్' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. ఈ మ్యాజిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి? తెలంగాణ యువత మొత్తానికి ఈ 'అనుముల హబ్' అవకాశాన్ని కల్పించండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

## డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100 ఎకరాల్లో గోదాంల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం ఎక్కువ దిగుబడి అయ్యే ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయాలని సూచించారు. గోదాంల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను వినియోగించుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## మహారాష్ట్ర సిఎస్‌తో సంజయ్ జాజు భేటీ

### - తెలంగాణ అభివృద్ధి తదితర అంశాలపై చర్చ

**హైదరాబాద్,ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రగతి, 'రైజింగ్ తెలంగాణ 2047' విజన్ తదితర అంశాలను వివరించారు. తెలంగాణ-మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఉన్న సత్సం బంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, పరస్పర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎండి సి.ఎస్. శెట్టిను ముంబైలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, 'రైజింగ్ తెలంగాణ 2047' లక్ష్యాలు తదితర అంశాలను ఆయన ఎస్‌బీఐ సీఎండీకి వివరించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సంజయ్ జాజు వివరించారు.

# ప్రతి కార్మికుడు ఐక్యంగా కృషి చేయాలి

**- పిలుపునిచ్చిన తెలంగాణ మజ్దూర్ యూనియన్ అశ్వత్తమ రెడ్డి.**

**- డిపోలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆత్మీయ సమ్మేళనం**

**- సంపూర్ణ ఉద్యోగ భద్రతతో కూడిన విలీనమే లక్ష్యం: అశ్వత్థామ రెడ్డి.**






**తొర్రూరు ప్రతినిధి, ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏ సమస్యనైనా ఐక్యంగా పోరాడితేనే విజయం సాధించుకోగలుగుతాం అని అన్నారు అశ్వత్థామ రెడ్డి. మహబూబాబాద్ జిల్లా,తొర్రూరు టీ జి ఎస్ ఆర్ టి సి బస్ డిపోలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వత్థామ రెడ్డి బుధవారం సుడిగాలి పర్యటనలో భాగంగా తొర్రూరు డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి, ఎంఎఫ్ విజయకుమార్, ఎస్బిఐ రజిత అధికారులతో పాటు డిపోలో అందుబాటులో ఉన్న 100 మందికి పైగా కార్మికులను ముఖాముఖిగా కలుసుకుని కార్మికుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా అశ్వత్థామ రెడ్డి ప్రసంగిస్తూ తెలంగాణ మజ్దూర్ యూనియన్ విజయానికి ప్రతి కార్మికుడు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించే విధంగా ప్రభుత్వంలో విలీనం చేయడమే తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత కోసం ఐక్యంగా పోరాడితేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని వివరించారు. కార్మికులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం యూనియన్ తరఫున నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కార్మికుల నుంచి విశేష స్పందన లభించింది. డిపో కార్యదర్శి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో కార్మికులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ బస్ స్టేషన్ మేనేజర్ మల్లికార్జున్, తొర్రూరు, అధ్యక్షుడు బి.కె. స్వామి, చైర్మన్ పద్మయ, గ్యారేజ్ కార్యదర్శి వెంకన్న, ఉమెన్స్ వింగ్ కోఆర్డినేటర్ నిర్మల తదితర నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్మికుల ఐక్యతే బలం సంపూర్ణ ఉద్యోగ భద్రతే లక్ష్యం అనే నినాదంతో తెలంగాణ మజ్దూర్ యూనియన్ ముందుకు సాగుతుందని నాయకులు తెలిపారు. నా పర్యటనలో ఇంత విశేష స్పందన కలిగించిన ఉద్యోగులు కార్మికులందరికీ అశ్వత్థామ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# నారాయణపూర్ కుడికాలువను పూర్తి చేస్తాం

**నారాయణపూర్ ప్రాజెక్టు అభివృద్ధికి రూ. 43.50 కోట్లు మంజూరు చేయించాం**



**కరీంనగర్ ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని నారాయణపూర్ నిర్వాసితులకు దశలవారిగా న్యాయం చేస్తాం. పని చేతగాక అసత్యాలు వల్లే వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గంగాధర మండల కేంద్రంలో విలేకరుల సమావేశం చొప్పదండి నియోజకవర్గం నారాయణపూర్ రిజర్వాయర్ తో పాటు, కుడి కాలువ నిర్మాణాన్ని పూర్తిచేసి ఇక్కడి భూములను సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. బుధవారం గంగాధర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణపూర్ రిజర్వాయర్ క్రింద ముంపునకు గురవుతున్న భూములు, ఇండ్ల కోసం, కట్ట ఎత్తు పెంచడం, బండ్ పటిష్టం, కాలువల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రూ. 43.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. త్వరలోనే కుడి కాలువ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని, ఏడాది కాలంలో పనులు పూర్తి చేసి నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేయిస్తామని భరోసా ఇచ్చారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ నారాయణపూర్ రిజర్వాయర్ కోసం ఒక్క రూపాయి కేటాయించలేదని ఎద్దేవా చేశారు. పని చేతకాని బిఆర్ఎస్ నాయకులు అబద్దాలు వల్లే వేస్తున్నారని దుయ్యబట్టారు. నారాయణపూర్ నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వమని, దశలవారీగా ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ప్రజలెవరు ప్రతిపక్షాల మాటలను నమ్మి ఆందోళనకు గురికావద్దని, చొప్పదండి నియోజకవర్గ ప్రజలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాధర, బోయినపల్లి మండలాల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ముద్ర నగేష్, భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, సర్పంచులు వేముల భాస్కర్, బారాజు ప్రభాకర్ రెడ్డి, బాస వేణి శ్రీనివాస్, ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఏనుగుల కనకయ్య, రోమల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..








**కరీంనగర్ టౌన్ ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలో భారతీయ జనతా పార్టీ కరీంనగర్ సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ నగరంలోని ప్రధాన వీధుల గుండా టవర్ సర్కిల్ వరకు నిర్వహించిన జాతీయ జెండా ర్యాలీలో విద్యార్థులు, యువత, మహిళలు మరియు వందలాది మంది ప్రజలతో కలిసి చేతుల్లో జాతీయ పతాకాలను పట్టుకొని పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో సాగిన ఈ ర్యాలీ నగర ప్రజల్లో దేశభక్తి భావనను మరింత పెంపొందించేలా నిర్వహించబడింది. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశ సమైక్యత, జాతీయ గౌరవం మరియు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రజలు విస్తృతంగా విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు తనుకు సాయికృష్ణ, కార్పొరేటర్లు గుగ్గిల్లపు రమేష్, వంగల పవన్, ఒంటెల సత్యనారాయణరెడ్డి, తాటి ప్రభావతి, గొట్టుముక్కల ఉమారాణి వెంకటరమణ, దేవసాని సరస్వతి సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యులు బల్బీర్ సింగ్, కన్న కృష్ణ, నాయకురాలు వరాల జ్యోతి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు , పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో అరటి మొక్కలు నాటిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..





**కరీంనగర్ టౌన్ ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఆవరణలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అరటి మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మేయర్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమని, చిన్నప్పటి నుంచే ప్రకృతిపట్ల ప్రేమ, చెట్ల పట్ల బాధ్యతాభావం అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాలలు విద్యతో పాటు సామాజిక బాధ్యతలను పెంపొందించే కేంద్రాలుగా ఉండాలని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థులకు సువర్ణప్రాశన చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యవంతంగా, క్రమశిక్షణతో ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల యాజమాన్యం నిర్వహిస్తున్న విద్యా, ఆరోగ్య, పర్యావరణ కార్యక్రమాలను మేయర్ గారు అభినందించారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుగ్గిళ్లపు రమేష్, ఏపీపీ చంద్ర, మాసం గణేష్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# పంట కుంటలతో రైతులకు నీటి భరోసా

**● మల్లంపల్లిలో ఫార్మ్ పాండ్ల నిర్మాణ పనులు ప్రారంభించిన సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు**




**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 12 (పీసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండలంలో VB`G RAM G (ఉపాధి హామీ పథకం) ద్వారా రైతులకు నీటి భరోసా కల్పించే దిశగా పంట కుంటల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మల్లంపల్లి, ఉమ్మానగర్ గ్రామాల్లో చేపట్టనున్న ఫార్మ్ పాండ్ల నిర్మాణ పనులను మల్లంపల్లి గ్రామ సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు మాట్లాడుతూ.. వర్షపు నీటిని ఒడిసి పట్టి పంట కుంటల్లో నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెంపొందుతాయని అన్నారు. వర్షాభావ పరిస్థితులు, కరువు సమయాల్లో పంటలకు సాగునీటి కొరత లేకుండా కాపాడేందుకు పంట కుంటలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పొలాల్లో పంట కుంటలను నిర్మించుకోవాలని, నీటి వనరులను సంరక్షించుకోవడం ద్వారా వ్యవసాయంలో మెరుగైన దిగుబడులు సాధించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. పంట కుంటల నిర్మాణంతో భూగర్భ జలాల పెంపుతో పాటు రైతులకు సాగునీటి భరోసా కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంకం సురేష్, సునీత, సాలయ్య, వార్డు సభ్యులు కూచన సురేష్, కొంగరి నరేందర్, బోరు శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, కూచన రమేష్ తదితరులతో పాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# మల్లంపల్లిలో మృతుని కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు..



**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి గ్రామానికి చెందిన కట్ల సూరయ్య అనారోగ్యంతో ఆగస్టు 11న మృతి చెందారు. విషయం తెలుసుకున్న మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు మృతుని కుటుంబాన్ని పరామర్శించి, సూరయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు మాట్లాడుతూ.. సూరయ్య మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేంద్ర గౌడ్, మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి, హెల్త్ & మెడికల్ సెల్ వింగ్ చైర్మన్ డాక్టర్ రవిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ చారి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వనమా శ్రీనివాస్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి: కల్లు గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కల్లు గీత కార్మిక సంఘం మల్లంపల్లి మండల అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వర్లు గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కక్కెర్ల సాంబయ్య గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 17న సోమవారం ములుగులో నిర్వహించనున్న "హలో కల్లు గీత.. చలో సోమవారం ములుగు" కల్లు గీత చైతన్య రణభేరి బస్సు యాత్ర పోస్టర్‌ను మల్లంపల్లి మండల కేంద్రంలోని వాటర్ ప్లాంట్ ఆవరణలో కల్లు గీత కార్మిక సంఘం నాయకులు ఆవిష్కరించారు. కత్తి హరీష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వెంకటేశ్వర్లు గౌడ్, సాంబయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ చైతన్య బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గీత కార్మికుల సంక్షేమం, హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ప్రభు త్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న సోమవారం ములుగులో జరిగే కల్లు గీత చైతన్య రణభేరి బస్సు యాత్రకు మల్లంపల్లి మండలంలోని గీత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెరు మాండ్ల విద్యాసాగర్ గౌడ్, పెరుమాండ్ల సారంగపాణి గౌడ్, జనగాం మల్లయ్య గౌడ్, బత్తిని రవిగౌ డ్, జనగాం రాజయ్య గౌడ్, భాస్కర్ గౌడ్, పొన్నం రవిగౌడ్, తోటకూరి మనోహర్ స్వామి గౌడ్, రవి గౌడ్, వడ్లకొండ రఘు గౌడ్ తదితరులతో పాటు సుమారు 20 మంది గీత కార్మికులు పాల్గొన్నారు.

# జాతీయ పరిరక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బి రెడ్డి కరుణాకర్ రెడ్డి మద్దతు

**కరీంనగర్ ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ని నారాయణపూర్ గ్రామన్ని ముప్పు గ్రామం గా ప్రకటంచాలని నారాయణపూర్ గ్రామ ప్రజల రిలే నిరాహార దీక్ష కు మద్దతు ఇచ్చిన జాతీయ పరిరక్షణ సమతి కరీంనగర్ ఉమ్మడి జిల్లా బి రెడ్డి కరుణాకర్ రెడ్డి,నారాయణ,రాములు, తదితరులు పాల్గొన్నారు.



# మహబూబాబాద్ జిల్లా హాకా డీలర్‌ల ఏకగ్రీవ ఎన్నిక

• (హైదరాబాద్ కో-ఆపరేటివ్ సొసైటీ. హాకా)



**తొర్రూరు ప్రతినిధి ,ఆగస్టు 12(పీసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా హాకా డీలర్ల ఎన్నికలను బుధవారం హాకా వరంగల్ కార్యాలయం నందు ఎన్నికలు నిర్వహించారు. మహబూబాద్ జిల్లాలో ఎన్నికల సమయంలో ఎవరు పోటీకి రాకపోవడంతో వచ్చిన పదవులకు అధికారులు వారందరినీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఎన్నికైన వారిలో అధ్యక్ష పదవిలో గుర్తురు గ్రామానికి చెందిన పెంతల రమాకాంత్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. వీడితోపాటు మిగతా కార్యవర్గ సభ్యులను కూడా ఎంపిక చేశారు. 2. ప్రధాన కార్యదర్శిగా బుర్ర సతీష్ (హాకా బయ్యారం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అధికారులు ప్రకటించారు.3.. ప్రధాన కోశాధికారిగా మంచిర్ల సురేష్ (హాకా పెద్ద వంగర). ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యుల పేర్లు. 1. సిహెచ్ , రవీందర్. 2. బి ,జంపయ్య. 3. వై, మధు. 4. సిహెచ్, రవి కిరణ్. 5. జీ ,వినయ్ కుమార్. 6. జి ,జగన్.7. బి, రాజు. 8. ఎం. మోహన్. 9. ఈ .శ్రీనివాస్.10. ఎం .రాజు. 11. పి .రామ్. 12. పి .సురేష్. 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. హాకా అధ్యక్ష పదవికి ఎన్నికైన రమాకాంత రెడ్డి తో పాటు, ప్రధాన కార్యదర్శి బుర్ర సతీష్, కోశాధికారి ఎం సురేష్ వీరు ఎవరు మా మీద నమ్మకంతో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎంపిక చేసినందుకు పేరుపేరునా ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యవర్గానికి అన్నింటిలో ముందుండి ఎవరికి ఏ సమస్య వచ్చినా బేధాభిప్రాయాలు లేకుండా అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటామని పేర్కొన్నారు.

# తాగునీటి సమస్యకు సీడీఏ చేయూత

• రూ.80 వేలతో ఉచిత మంచినీటి చేతిపంపు ఏర్పాటు

• సర్పంచ్ మాలోతు రాధాకృష్ణ, సిడిఏ కార్యదర్శి ఏనుష్ కుమార్









**పెనుబల్లి, ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పెనుబల్లి మండలం గంగాదేవిపాడు గ్రామంలోని బీసీ కాలనీలో తాగునీటి సమస్యకు సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్ (సీడీఏ) సంస్థ ఆధ్వర్యంలో రూ.80 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి చేతిపంపును సీడీఏ కార్యదర్శి, ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షులు రెవ. ఎనోష్ కుమార్, గ్రామ సర్పంచ్ మాలోత్ రాధాకృష్ణతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాలనీలో తాగునీటి ఇబ్బందులను సీడీఏ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి చేతిపంపు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రెవ. ఎనోష్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీరు ప్రజల ఆరోగ్యానికి ఎంతో అవసరమని, పేదలు, వెనుకబడిన వర్గాల కోసం సీడీఏ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని తెలిపారు. అనంతరం సర్పంచ్ మాలోత్ రాధాకృష్ణ, రెవ. ఎనోష్ కుమార్‌ను గ్రామస్తులు శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనకాల సురేష్, గిరిజన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కాక వెంకటేశ్వరావు, ఓర్స్ నాగేంద్రం, మాజీ ఉపసర్పంచ్ మూడు సోమ్లా, ప్రసాద్, నాగరాజు, గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

# ఆదర్శనగర్‌లో రూ.10 లక్షలతో సీసీ డ్రైన్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన..



**కరీంనగర్ టౌన్ ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 26వ డివిజన్ ఆదర్శనగర్‌లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైన్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం నగర పాలక సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.ఆదర్శనగర్‌లో చేపట్టనున్న సీసీ డ్రైన్ పైప్‌లైన్ పనులు పూర్తయిన అనంతరం కాలనీవాసులకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించడంతో పాటు డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజల సహకారం ఎంతో అవసరమని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ గారు, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు, స్థానిక నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పిసిడబ్ల్యూ న్యూస్ కథనానికి స్పందన

## ఎలుకల బెడదపై సబ్ కలెక్టర్ సీరియస్

## విద్యార్థుల భద్రతకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం







**పెనుబల్లి, ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్)** :మండలంలో అడివిమల్లెల గురుకుల పాఠశాలను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఐఏఎస్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల, వసతి గృహంలోని పరిస్థితులను పరిశీలించిన ఆయన.. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్య పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎలుకల నిర్మూలనకు తక్షణమే సమగ్ర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహం, పాఠశాల భవనాల్లోకి ఎలుకలు ప్రవేశించకుండా దెబ్బతిన్న మెష్‌లను వెంటనే మరమ్మతు చేయాలని, అవసరమైన చోట కొత్త మెష్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.అదేవిధంగా పాఠశాల, వసతి గృహ ప్రాంగణాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు క్రమం తప్పకుండా పెస్ట్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ స్పష్టం చేశారు. అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎలుకల నిర్మూలన, మెష్‌ల మరమ్మతులు తదితర పనులను వెంటనే పూర్తి చేసి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థుల భద్రతకు సబ్ కలెక్టర్ ప్రాధాన్యం ఇస్తూ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# బావుపేట రోడ్డు మరమ్మత్తు లకోసం నిధులు కేటాయించింది కేంద్ర మంత్రి బండి సంజయ్..

## నిధుల ఘనత తమదేనని బిఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల ప్రచారం చేసుకోవడానికి సిగ్గుండాలి...

## కొత్తపల్లి బిజెపి మండల అధ్యక్షులు కుంట తిరుపతి...





**కొత్తపల్లి ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ – కామారెడ్డి ప్రధాన రహదారిలో పూర్తిగా చెడిపోయిన బావుపేట రోడ్డు మరమ్మత్తుల కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తన ఎంపీ నిధుల నుండి రూ. 16 లక్షలు కేటాయించినందుకు బిజెపి కొత్తపల్లి మండల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు అధ్యక్షులు కుంట తిరుపతి చెప్పారు. బావు పేట వద్ద రోడ్డు మరమ్మత్తుల కోసం రూ. 16 లక్షల ఎంపీ నిధులు కేటాయించడం పట్ల కొత్తపల్లి బిజెపి శాఖ హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం రోజున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ చిత్రపటానికి పాలాభిషేక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కుంట తిరుపతి మాట్లాడుతూ రోడ్డు మరమ్మతుల కోసంనిధులు ఇచ్చింది కేంద్రమంత్రి బండి సంజయ్ అయితే.. కరీంనగర్ టిఆర్ఎస్ ఎమ్మెల్యే క్రెడిట్ కోసం పాకులాడుతున్నారని ఘాటుగా విమర్శించారు. బావుపేట రోడ్డు నిర్మాణానికి కేంద్రమంత్రి బండి సంజయ్ నిధులు మంజూరు చేస్తే, ఆ ఘనతంతా తమదేనంటూ బిఆర్ఎస్ నేతలు, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రచారం చేసుకోవడానికి సిగ్గుండాలన్నారు .. సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన బి ఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల చేయలేదని , నేడు సోషల్ మీడియా వేదిక గా రోడ్డు మరమతు విషయంలో బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసుకోవడం పట్ల ఆయన మండిపడ్డారు. కరీంనగర్ కామారెడ్డి ప్రధాన రహదారులో ప్రజల ప్రయాణ ఇబ్బందులను తొలగించేందుకు తక్షణ స్పందించి రూ. 16 లక్షలు కేటాయించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌కు కొత్తపల్లి మండల ప్రజల పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలను తెలియజేశారు .. ఈ కార్యక్రమంలో మండలంలోని పార్టీ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు,సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పొత్తూరి శాంతి సందేశం పుస్తక ఆవిష్కరణ







## - అద్భుతం 'రణము నాపవయ్య రామచంద్ర' శతకం

## - యుద్ధ భీతిలో ఉన్న ప్రపంచానికి కవి పొత్తూరి సీతారామారావు కలం అందించిన అక్షర శాంతి మంత్రం



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచమంతా యుద్ధ మేఘాలు అలముకొని, అశాంతి జ్వాలల్లో నలిగిపోతున్న వేళ... హృదయాలను తాకే అక్షరాలతో శాంతిని ప్రభోదించడం సమాజానికి అత్యంత ఆవశ్యకమని ప్రముఖ కవులు, విశిష్ట అతిథులు కొనియాడారు. ప్రముఖ కవి, రిటైర్డ్ ఉపాధ్యాయులు పొత్తూరి సీతారామారావు కలం నుండి జాలువారిన అద్భుత శతక కావ్యం 'రణము నాపవయ్య రామచంద్ర' పుస్తకావిష్కరణ సభ బుధవారం సాయంత్రం ఖమ్మం గట్టయ్య సెంటర్ లోని రోటరీ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ లో నయనానందకరంగా జరిగింది.రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం, జనవిజ్ఞాన వేదిక, జాషువా సాహిత్య వేదిక, అక్షరాల తోవ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ కవి, జాషువా సాహిత్య వేదిక అధ్యక్షులు మువ్వా శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షుడు హరి శ్రీనివాస్, ప్రముఖ కవులు జీవన్, హెచ్‌విఎల్ ప్రసాద్ బాబు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ... "హింస, విద్వేషాలతో అట్టుడుకుతున్న నేటి జగత్తుకు శాంతి భిక్ష పెట్టమని శ్రీరామచంద్రుడిని వేడుకునే రీతిలో రూపుదిద్దుకున్న ఈ శతకం ప్రతి ఒక్కరి హృదయాన్ని ద్రవింపజేస్తుంది. పొత్తూరి సీతారామారావు తన ఉపాధ్యాయ వృత్తికి, కవితా పటిమకు సార్థకత చేకూరుస్తూ మానవతను నిద్రలేపే అక్షర శాంతి మంత్రాన్ని అందించారు" అని ప్రశంసించారు. అనంతరం ఈ పుస్తకంపై ప్రముఖ రచయిత, ఉపాధ్యాయులు జి.డి.ఎస్.వి. రమణ ఆత్మీయ సమీక్ష చేస్తూ, పద్యాల్లోని గంభీరతను, శతకంలోని మానవీయ కోణాన్ని సభకు వివరించారు. ఈ అక్షర పండుగలో ప్రముఖ కవి ఆనందాచారి, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు అరుణశ్రీ, పుస్తక రచయిత పొత్తూరి సీతారామారావు, జెవివి రాష్ట్ర బాధ్యులు అలవాల నాగేశ్వరరావు, ప్రముఖ కవి, హెచ్ఎం కన్నెగంటి వెంకటయ్య, అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, కవి రామానుజాచార్యులు, జాషువా సాహిత్య వేదిక కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కవులు.. దేవయ్య, కోండ్రు బ్రహ్మం, నామా రామారావు, కట్టెకోల చిన నర్సయ్య, రాచమళ్ళ ఉపేందర్ తదితర సాహిత్య ప్రియులు, మేధావులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# సండ్రపై పిడమర్తి రవి చేసిన అనుచిత వ్యాఖ్యలు

## తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

## రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలి..

## వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగడం సరికాదు



**సత్తుపల్లి, ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సండ్ర వెంకట వీరయ్య పై పిడమర్తి రవి చేసిన అనుచిత వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ విమర్శలకు ఒక హద్దు ఉంటుందని, వ్యక్తిగత విమర్శలు, కుటుంబ సభ్యులను రాజకీయ వివాదాల్లోకి లాగడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని మండిపడ్డారు. నీకున్న నలుపును తీసుకుని అందరికీ అంటించాలని చూడటం సరికాదు. వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయాల్లో మంచి సంప్రదాయం కాదు అంటూ పిడమర్తి రవికి బీఆర్ఎస్ నాయకులు హితవు పలికారు. సండ్ర వెంకట వీరయ్యకు సంబంధం లేని అంశాలను ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఆపాదిస్తూ మాట్లాడటం రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమని విమర్శించారు. సైబర్ నేరాలకు సంబంధించిన అంశాలపై పోలీసులు, దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలు వాస్తవాలను తేలుస్తాయని దర్యాప్తు పూర్తికాకముందే వాటిని రాజకీయంగా ఉపయోగించుకుని వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని అన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం, వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడటం బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడి లక్షణం కాదని పేర్కొన్నారు. మాక్కూడా మాట్లాడటం వచ్చు.. కానీ రాజకీయాల్లో వ్యక్తిగత జీవితాలను, కుటుంబాలను లక్ష్యంగా చేసుకోవడం మా సంస్కారం కాదు అని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. సండ్రపై, తన కుటుంబంపై వ్యాఖ్యలు చేసే ముందు పిడమర్తి రవి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులను రాజకీయ విమర్శల్లోకి లాగడం పూర్తిగా ఖండించాల్సిన విషయమని అన్నారు. పిడమర్తి రవి గత రాజకీయ ప్రస్థానం, గతంలో ఆయన చేసిన రాజకీయ వ్యాఖ్యలను తాము కూడా ప్రస్తావించగలమని, అయితే వ్యక్తిగత విషయాలను బయటకు తీసుకురావడం తమ రాజకీయ సంస్కారం కాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఫేమస్ అవ్వాలనే ఉద్దేశంతో సండ్ర వెంకట వీరయ్య పేరును పదేపదే ప్రస్తావించడం వల్ల పిడమర్తి రవికే రాజకీయంగా నష్టం జరుగుతుంది అని వ్యాఖ్యానించారు. సండ్ర వెంకట వీరయ్యపై గతంలో రెండుసార్లు పోటీ చేసిన పిడమర్తి రవి, ప్రజల్లో బలమైన నాయకుడిగా ఉన్న సండ్రను విమర్శించే ముందు తన రాజకీయ స్థాయిని, ప్రజల్లో తనకున్న ఆదరణను ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. సండ్ర వెంకట వీరయ్య కుటుంబ సభ్యులను రాజకీయ విమర్శల్లోకి లాగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకుల కుటుంబ సభ్యుల్లో ఎవరైనా తప్పు చేస్తే, అందుకు ఆ పార్టీ నాయకులను లేదా వారి కుటుంబ సభ్యులను బాధ్యులుగా చేస్తామా అని ప్రశ్నించారు. వ్యక్తిగత తప్పులకు వ్యక్తులే బాధ్యత వహించాలి తప్ప.. రాజకీయ ప్రయోజనాల కోసం కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం సరైన విధానం కాదన్నారు. సండ్ర వెంకట వీరయ్య సత్తుపల్లి నియోజకవర్గ ప్రజల కోసం ఎన్నో సంవత్సరాలుగా నిబద్ధతతో పనిచేస్తున్న సీనియర్ నాయకుడని పేర్కొన్నారు. ఆయనపై అసత్య ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ శ్రేణులు మౌనంగా ఉండబోవని హెచ్చరించారు. ఇకనైనా పిడమర్తి రవి బాధ్యతాయుతంగా మాట్లాడాలని, వ్యక్తిగత విమర్శలు, కుటుంబ సభ్యుల ప్రస్తావనకు దూరంగా ఉండి రాజకీయ విమర్శలను చేయాలని బీఆర్ఎస్ నాయకులు హితవు పలికారు.

# ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి



## ఐదు నెలల్లో మూడు కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాం ప్రత్యేక బడ్జెట్ సమావేశాన్ని కూడా విజయవంతంగా పూర్తి చేశాం

## రికార్డులు చూసి మాట్లాడాలి రాజకీయ విమర్శల కోసం ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదు

## మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపణలకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘాటు కౌంటర్

**కరీంనగర్ టౌన్ ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థలో మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేదని, మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని మాజీ మేయర్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ చేసిన ఆరోపణలను కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. మేయర్ మాట్లాడుతూ, గత ఐదు నెలల కాలంలో మూడు పర్యాయాలు కౌన్సిల్ సమావేశాలు నిర్వహించామని, అంతేకాకుండా నగర అభివృద్ధికి అత్యంత కీలకమైన బడ్జెట్ సమావేశాన్ని కూడా ప్రత్యేకంగా నిర్వహించి బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదంతో అమలు చేస్తున్నామని తెలిపారు. "కౌన్సిల్ సమావేశాలు జరగడం లేదని చెప్పడం పూర్తిగా అసత్యం. జరిగిన సమావేశాలన్నీ నగరపాలక సంస్థ అధికారిక రికార్డుల్లో ఉన్నాయి. అలాంటప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యం" అని మేయర్ పేర్కొన్నారు.

**మాజీ మేయర్‌గా పనిచేసిన వ్యక్తికే నిబంధనలు తెలియవా?** సర్దార్ రవీందర్ సింగ్ గతంలో ఇదే నగరానికి మేయర్‌గా పనిచేశారని గుర్తు చేసిన మేయర్, మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలన, కౌన్సిల్ సమావేశాల నిర్వహణ, అజెండా ప్రక్రియ, అధికారిక విధానాలపై ఆయనకు పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. "మాజీ మేయర్ హోదాలో పనిచేసిన వ్యక్తి అధికారిక రికార్డులను పరిశీలించకుండా, జరిగిన సమావేశాలను కూడా జరగలేదని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే" అని ఆయన విమర్శించారు.

**కౌన్సిల్‌కు భయపడాల్సిన అవసరం మాకు లేదు** ప్రజా సమస్యలపై చర్చించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నామని మేయర్ స్పష్టం చేశారు. "కౌన్సిల్ ప్రజాస్వామ్య వేదిక. కార్పొరేటర్లు తమ డివిజన్ల సమస్యలను ప్రస్తావించేందుకు సమావేశాలు నిర్వహించడం మా బాధ్యత. అందుకే ఐదు నెలల్లో మూడు సమావేశాలు నిర్వహించాం. బడ్జెట్‌ను కూడా కౌన్సిల్ ముందుకు తీసుకువచ్చి చర్చించి ఆమోదించాం. భయపడే వారమైతే ఈ సమావేశాలు ఎందుకు నిర్వహిస్తాం?" అని ప్రశ్నించారు.

**ప్రజలకు లెక్కలతో సమాధానం చెబుతున్నాం** ఆరోపణలు చేయడం సులభమని, కానీ ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని మేయర్ అన్నారు. "ఐదు నెలలు మూడు కౌన్సిల్ సమావేశాలు ఒక ప్రత్యేక బడ్జెట్ సమావేశం. ఇది రాజకీయ ప్రకటన కాదు. నగరపాలక సంస్థ రికార్డుల్లో పరిశీలించగలిగే వాస్తవం. ఏ సమావేశం ఎప్పుడు జరిగింది, ఏ అజెండాపై చర్చ జరిగింది, ఏ నిర్ణయాలు తీసుకున్నారు అన్న వివరాలన్నీ అధికారిక రికార్డుల్లో ఉన్నాయి" అని తెలిపారు.

**ఫిర్యాదుల రాజకీయాల కంటే అభివృద్ధికి సహకరించండి** కరీంనగర్ నగరంలో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, మౌలిక వసతులు, విలీన గ్రామాల అభివృద్ధి తదితర అంశాలపై నగరపాలక సంస్థ నిరంతరం పనిచేస్తోందని మేయర్ పేర్కొన్నారు. "ప్రతి అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చడం వల్ల అభివృద్ధి జరగదు. మీరు కూడా ప్రజలు ఎన్నుకున్న కార్పొరేటర్. మీ డివిజన్ సమస్యలను తీసుకురండి. నగర అభివృద్ధికి అవసరమైన సూచనలు చేయండి. మంచి సూచన ఉంటే స్వీకరించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అభివృద్ధికి కలిసి పనిచేద్దాం" అని పిలుపునిచ్చారు.

**'సోయి లేదా?' అని అడిగే ముందు వాస్తవాలు తెలుసుకోండి** "మున్సిపల్ కౌన్సిల్ సమావేశంపై సోయి లేదా?" అని చేసిన వ్యాఖ్యపై మేయర్ స్పందిస్తూ "మాకు కౌన్సిల్‌పై పూర్తి అవగాహన ఉంది. నగర ప్రజల సమస్యలపై కూడా పూర్తి బాధ్యత ఉంది. అందుకే ఐదు నెలల్లో మూడు కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాం. బడ్జెట్ సమావేశాన్ని కూడా పూర్తి చేశాం. 'సోయి లేదా?' అని ప్రశ్నించే ముందు జరిగిన సమావేశాల గురించి తెలుసుకునే సోయి కూడా ఉండాలి" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**రాజకీయాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు** కౌన్సిల్ సమావేశాలు, నగర అభివృద్ధి వంటి అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం మానుకోవాలని మేయర్ సూచించారు. "విమర్శలను స్వాగతిస్తాం. నిర్మాణాత్మక సూచనలను స్వీకరిస్తాం. ప్రజా సమస్యలను కౌన్సిల్‌లో చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ జరిగిన దాన్ని జరగలేదని చెప్పడం, వాస్తవాలను వక్రీకరించి ప్రజల్లో అపోహలు సృష్టించడం మాత్రం అంగీకరించం. కరీంనగర్ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. వారికి వాస్తవాలు తెలుసు. మాటల రాజకీయాలు కాదు పనులతో సమాధానం చెబుతాం. ఆరోపణలు కాదు అభివృద్ధే మా అజెండా. ప్రజలను తప్పుదోవ పట్టించడం కాదు కరీంనగర్ అభివృద్ధికి కలిసి రావాలి." అని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# కరీంనగర్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ.. దేశభక్తిని చాటుకున్న బీజేపీ శ్రేణులు....



బిజెపి వెస్ట్ జోన్, ఢిల్లీ డిఫెన్స్ స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీని ప్రారంభించిన జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం...





**కరీంనగర్ టౌన్ ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** 80వ దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమంలో భాగంగా, కరీంనగర్ బిజెపి వెస్ట్ జోన్ అధ్యక్షుడుజాడి బాల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రోజున ఢిల్లీ డిఫెన్స్ విద్యార్థులతో కలిసి తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఈ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా 2022 సంవత్సరం నుండి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రజలందరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసి, దేశంపై తమకున్న దేశభక్తి భావాన్ని చాటిచెబుతున్నారు, తిరంగా కార్యక్రమాలు దేశ ఐక్యతను మరింత పటిష్టం చేయడానికి, నేటి యువతలో దేశభక్తి భావాలను పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, భావితరాలకు దేశభక్తి విలువలను అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరులను ప్రతి ఒక్కరూ స్మరించుకొని , గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం మన జాతీయ గౌరవానికి, సార్వభౌమత్వానికి ప్రతీక. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా దేశం కోసం అందరూ ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ర్యాలీలో జాతీయ జెండాలను చేతబూని నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. "భారత్ మాతా కీ జై" నినాదాలతో నగరంలోని పలు ప్రాంతాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల ఆంజనేయులు , పార్లమెంటు కన్వీనర్ ,కార్పొరేటర్ ప్రవీణ్ రావు, సీనియర్ నాయకులుగుజ్జ శ్రీనివాస రావు , కార్పొరేటర్లు బండ రమణారెడ్డి కర్రె పద్మ అనీల్ , జోన్ అధ్యక్షులు జాడి బాల్ రెడ్డి , బూత్ ప్రెసిడెంట్ పరశురాములు, బి ఎల్ ఎ 2లు కాసం సంతోష్, గాడుగోని రమేష్, మల్లారెడ్డి ,చందర్, తిరుమలరెడ్డి, ఉదయ్, నరేష్, బండ రాకేష్, విద్యాసాగర్ ల తో పాటు ఢిల్లీ డిఫెన్స్ స్కూల్ విద్యార్థులు , పెద్ద సంఖ్యలో యువకులు ర్యాలీలో పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ..

## •దేశభక్తి, ఐక్యతే లక్ష్యం: గంగాడి కృష్ణారెడ్డి..





**హుజురాబాద్ ఆగస్టు 12(పిసిడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ పట్టణంలో బుధవారం రోజున దేశభక్తిని చాటేలా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ తిరంగా ర్యాలీలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశభక్తి భావనను పెంపొందించడానికి, ప్రజల్లో జాతీయ ఐక్యతను చాటడానికే ప్రతి ఏటా ఈ మోడీ ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా అభియాన్ అభియాన్ పేరిట ప్రోగ్రాం నిర్వహిస్తుందని తెలిపారు.,దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం మన జాతీయ గౌరవానికి, సార్వభౌమత్వానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా దేశం కోసం అందరూ ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. ఈ ర్యాలీలో జాతీయ జెండాలను చేతబూని నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. "భారత్ మాతా కీ జై" నినాదాలతో పట్టణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీణ్ రెడ్డి కౌన్సిలర్ పంజాల మనోజ్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తపల్లి జోన్ శాఖ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర..





**కొత్తపల్లి ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్ రావు ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమం ముఖ్య అతిథి బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం , డిప్యూటీ మేయర్ సునీల్ రావు పాల్గొని తిరంగా ర్యాలీని ( బైకులతో బైక్ ర్యాలీ) ప్రారంభించి మాట్లాడారు. నరేంద్ర మోడీ 2022లో ప్రారంభించిన ఈ తిరంగా యాత్ర హర్ గర్ తిరంగా ప్రతి సంవత్సరం ప్రజలు దేశభక్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. దేశ ఐక్యత కోసం ప్రతి ఒక్కరు కూడా ప్రతి ఇంటి మీద జెండా ఎగరవేయాలని సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వాసల రమేష్ , జిల్లా నాయకులు గుంజేటి శివకుమార్ , వేముల చంద్రశేఖర్, రాచకొండ కొమురయ్య, సోమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, జిట్టవేణి రేనయ్య,తొంటి వీరేశం,దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

# 500 రోజులుగా నిరంతర అన్నదానం.. లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సేవలు

**కరీంనగర్, ఆగస్టు 12(పీసీడబ్ల్యూ న్యూస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మీల్స్ ఆన్ వీల్స్ ఆకలి నివారణ కార్యక్రమం" 500 వరుస రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కరీంనగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని మీల్స్ ఆన్ వీల్స్ కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమానికి మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా, కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరుపేదలు, అవసరంలో ఉన్న వారికి ఉచితంగా పోషకాహార భోజనం, అరటిపండ్లను పంపిణీ చేశారు. అతిథులు, లయన్స్ క్లబ్ సభ్యులు స్వయంగా భోజనం వడ్డించి సేవలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ఎలాంటి విరామం లేకుండా 500 రోజుల పాటు నిరంతరంగా



ఆకలి నివారణ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిరుపేదలు, ఆకలితో ఉన్న వారికి ప్రతిరోజూ భోజనం అందిస్తున్న లయన్స్ సభ్యులు, దాతలు, స్పాన్సర్లు, వాలంటీర్ల సేవలను కొనియాడారు.500 రోజులు పూర్తి కావడం కేవలం ఒక సంఖ్య కాదని, 500 రోజుల సేవ, కరుణ, అంకితభావానికి ప్రతీక అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఎంతోమంది నిరుపేదలకు ఆహారంతో పాటు ఆత్మగౌరవం, ఆనందాన్ని అందించగలిగామని పేర్కొన్నారు.మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని క్లబ్ ప్రెసిడెంట్, చీఫ్ కో-ఆర్డినేటర్ మ్యాదం శివకాంత్ పటేల్తో పాటు ముక్క శరత్ కృష్ణ, బట్టు వినోద్ పటేల్, పెద్ది విద్యాసాగర్, బోడ్ల రవీందర్, చిదుర సురేష్ తదితరులు సమన్వయం చేస్తున్నారు.కార్యక్రమం విజయవంతంగా 500 రోజులు పూర్తి చేసుకోవడానికి సహకరించిన దాతలు, స్పాన్సర్లు, లయన్స్ సభ్యులు, వాలంటీర్లు, శ్రేయోభిలాషులకు మీల్స్ ఆన్ వీల్స్ టీమ్ కృతజ్ఞతలు తెలిపింది. భవిష్యత్తులో ఈ సేవా కార్యక్రమాన్ని మరింత విస్తరించి, మరింతమంది నిరుపేదలకు సేవలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# ఎన్నికల వరకే రాజకీయాలు

**• అభివృద్ధి పనుల్లో అందరికీ సమాన ప్రాధాన్యం • అన్ని వర్గాలు, పార్టీలకు సమదృష్టితో అభివృద్ధి ఫలాలు అందిస్తాం: మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్**



**కల్లూరు, ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎన్నికల వరకే రాజకీయాలు.. ప్రజల అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా అందరికీ సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్ అన్నారు. కల్లూరు మున్సిపాలిటీలో ఇటీవల మంజూరైన అభివృద్ధి పనుల్లో భాగంగా 15వ వార్డులో కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్ ఆధ్వర్యంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు.15వ వార్డులో 14వ వార్డు కౌన్సిలర్ రేష్మ ఇంతియాజ్ ఇంటి ముందు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. పాలక మండలి పదవీకాలం ముగిసే వరకు ఇదే విధానాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి విషయంలో అన్ని పార్టీలను, అన్ని వర్గాలను సమదృష్టితో చూస్తూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ప్రాంతానికి అభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 15వ వార్డులో అభివృద్ధి పనులను చురుగ్గా ముందుకు తీసుకెళ్తున్న కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్‌ను ఈ సందర్భంగా చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, 15వ వార్డు కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్, 14వ వార్డు కౌన్సిలర్ రేష్మ ఇంతియాజ్, 1వ వార్డు కౌన్సిలర్ జిల్లెల్ల స్వాతి భాస్కర్‌రెడ్డి, కల్లూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పొట్రు అర్జున్‌రావు, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# కబరస్తాన్ పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలి

**- పవిత్ర స్థలాలపై ఆక్రమణ యత్నాలను అడ్డుకోవాలి**

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డికి ముస్లిం సోదరుల వినతి**






**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలోని పవిత్రమైన కబరస్తాన్ స్థలాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని 59, 60వ డివిజన్లకు చెందిన ముస్లిం సోదరులు కోరారు. తమ ప్రార్థనా స్థలాలు, పూర్వీకుల సమాధుల ప్రదేశాలు భద్రంగా ఉండటం ప్రతి సమాజం గౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొంటూ పెద్ద సంఖ్యలో వారు రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి తరలివెళ్లారు.రామన్నపేటదానవాయిగూడెం పరిసర ప్రాంతాల్లోని కబరస్తాన్ గేటు ముందు ఉన్న వాహనాల పార్కింగ్ స్థలం, ప్రార్థనా స్థలాన్ని కొందరు తప్పుడు ధృవపత్రాలను చూపిస్తూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా తమ సమాజానికి ఆధ్యాత్మిక, భావోద్వేగ అనుబంధం ఉన్న స్థలాలను కాపాడాలని కోరుతూ కార్యాలయ ఇన్‌చార్జ్ తంబూరి దయాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.వినతిపై స్పందించిన దయాకర్‌రెడ్డి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేసినట్లు ప్రతినిధులు తెలిపారు. సమస్యను సానుకూలంగా స్వీకరించి వెంటనే స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.కబరస్తాన్ కు అనుబంధంగా ఉన్న స్థలాన్ని అధికారికంగా పరిరక్షించి, భవిష్యత్‌లో ఎలాంటి ఆక్రమణలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు. పవిత్ర స్థలాల విషయంలో వివాదాలకు అవకాశం లేకుండా రెవెన్యూ, మున్సిపల్, పోలీసు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం స్థల ఆక్రమణ యత్నంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కబర్‌స్తాన్ పరిరక్షణ అనేది కేవలం ఒక వర్గానికి సంబంధించిన సమస్య కాదని, ప్రతి మతం, ప్రతి సమాజం పవిత్ర స్థలాల పట్ల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వారు పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ, పెంటు సాహెబ్, ఇబ్రహీం, చాంద్ జానీ, న్యాయవాది నాగుల్ మీరా మసీద్ సదర్, రిటైర్డ్ వీఆర్వో జానిమియా తదితరులతో పాటు మహిళలు, మైనారిటీ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పప్పుల మిల్లులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**- 9 మంది అరెస్ట్.. రూ.18,350 నగదు, 7 బైక్‌లు స్వాధీనం**




**తల్లాడ, ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తల్లాడ మండల కేంద్రంలోని ధారా శ్రీను పప్పుల మిల్లులో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ.18,350 నగదు, ఏడు మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పప్పుల మిల్లుపై దాడి చేసి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న నగదు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మండల పరిధిలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరించారు. పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలకు పటిష్ట చర్యలు

**క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**నంద్యాల, ఆగస్టు 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్, వైద్య బృందంతో కలిసి ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్రిటికల్ కేర్ యూనిట్‌లో మొదటి అంతస్తు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, రెండో అంతస్తు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జజఖ



అందుబాటులోకి వచ్చిన అనంతరం అత్యవసర, తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే ఆసుపత్రిలో అన్ని రకాల ఆపరేషన్ థియేటర్లను అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో గతంలో ఉన్న నీటి ఎద్దడి సమస్యను సంప్ నిర్మాణం ద్వారా పరిష్కరించామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం అన్ని వార్డులకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా నీటి సరఫరా జరుగుతోందని తెలిపారు.రోగులకు ప్రభుత్వం అందిస్తున్న ఆహారం నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. గైనకాలజీ వార్డులోని రోగులకు హై-ప్రోటీన్ డైట్, ఇతర రోగులకు సాధారణ డైట్, విధుల్లో ఉన్న వైద్యులకు అవసరమైన ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. రోగులకు నాణ్యమైన ఆహారం అందుతున్నదీ లేనిదీ నిర్ధారించేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన వైద్య విభాగం, సేవలపై సరైన సమాచారం అందించేందుకు హెల్ప్ డెస్క్ సేవలను మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. రోగులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అర్హులైన ప్రతి రోగికి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఉచిత వైద్య చికిత్స అందేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు.

# కుల్‌దీప్‌కు తుది జట్టులో స్థిరత్వం కల్పించాలి



● టీమిండియా

## మాజీ స్పిన్నర్ మురళీ కార్తీక్ సూచన

భారత స్టార్ చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ సరిగ్గా ఉపయోగించుకోవట్లేదనే ఆందోళన మాజీ క్రికెటర్లలో తీవ్రమవుతోంది. 15 మందిలో ఉంటున్నప్పటికీ అతడికి తుది జట్టులో మాత్రం ఆడే అవకాశం రావట్లేదు. ఇటీవల ఇంగ్లాండ్‌తో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లోనూ అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు కుల్‌దీప్‌ను ఉద్దేశించి.. టీమిండియా మాజీ స్పిన్నర్ మురళీ కార్తిక్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ, ద్రవిడ్ హయాంలో కుల్‌దీప్‌ను ఒక అసలైన మ్యాచ్ విన్నర్‌గా చూస్తూ పూర్తి స్వేచ్ఛ, భరోసా ఇచ్చారని గుర్తు చేశాడు. ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సైతం అదే బాటలో ఈ స్పిన్నర్ విషయంలో అలాంటి నిర్ణయాలే తీసుకోవాలని హితవు పలికాడు. కాగా రాహుల్ ద్రవిడ్ కోచింగ్ హయాంలో (2021 నవంబర్ నుంచి 2024 జూన్ వరకు) కుల్‌దీప్ అన్ని ఫార్మాట్లలో కలిపి నెలకు సగటున 2 మ్యాచ్‌ల చొప్పున 60 మ్యాచ్‌లు ఆడాడు. అయితే గంభీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ సగటు నెలకు 1.5 మ్యాచ్‌లకు (38 మ్యాచ్‌లు) పడిపోయింది. ముఖ్యంగా ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో కుల్‌దీప్‌ను కాదని నలుగురు పేసర్లతో బరిలోకి దిగడం అతని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. కుల్‌దీప్ పట్ల ప్రస్తుత మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్న తీరుపై సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా తన యూట్యూబ్ ఛానెల్‌లో బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. గంభీర్ హయాంలో బౌలింగ్ పదును కంటే బ్యాటింగ్ డెప్త్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంపై మురళీ కార్తీక్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. టెస్టు మ్యాచ్ గెలవాలంటే ప్రత్యర్థి 20 వికెట్లు తీయడం అత్యంత కీలకమని వ్యాఖ్యానించాడు. కేవలం బ్యాటింగ్ డెప్త్ కోసం బౌలింగ్‌ను బలహీనపర్చకూడదని పేర్కొన్నాడు. కుల్‌దీప్ బ్యాట్‌తో ఏమీ అసమర్థుడు కాదని, నైట్‌వాచ్‌మన్‌గా ఎన్నోసార్లు ఎక్కువ సేపు క్రీజులో నిలబడిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశాడు. జడేజా, అశ్విన్ వలె భారీ హిట్టింగ్ చేయలేకపోయినా, ఒక ప్రామాణిక స్పిన్ బౌలర్‌గా ప్రపంచంలో ఎక్కడైనా వికెట్లు తీయగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని కొనియాడాడు. తుది జట్టులో తన స్థానం ఖాయమనే భరోసా కల్పించినపుడే ఆటగాళ్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తారని ఈ సందర్భంగా మురళీ కార్తిక్ చెప్పుకొచ్చాడు.

# పోర్చుగల్ టీ20 జట్టు కెప్టెన్‌గా మోసెస్ హెన్రిక్స్



క్రికెట్ ప్రపంచంలో ఆస్ట్రేలియా తరఫున సుదీర్ఘ కాలం పాటు ఆల్ రౌండర్‌గా సేవలందించిన మోసెస్ హెన్రిక్స్ తన కెరీర్‌లో అత్యంత ఆసక్తికరమైన రెండో అధ్యాయాన్ని ప్రారంభించాడు. ఇన్నాళ్లు ఆస్ట్రేలియా తరఫున క్రికెట్ ఆడిన అతడు.. ఇప్పుడు మరో దేశ జాతీయ జట్టుకు కెప్టెన్ అయ్యాడు. ఈ మేరకు పోర్చుగల్ జాతీయ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా హెన్రిక్స్‌ను నియమిస్తూ పోర్చుగల్ క్రికెట్ బోర్డు ప్రకటన విడుదల చేసింది. అతడి సారథ్యంలోనే పోర్చుగల్ జట్టు 2028 టీ20 వరల్డ్ కప్ యూరప్ సబ్-రీజినల్ క్వాలిఫయర్ 'సి'లో తలపడనుంది. ఫిన్‌లాండ్ వేదికగా ఆగస్టు 14 నుంచి 21 వరకు ఈ టోర్నీ జరగనుంది. ఫుట్‌బాల్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో జన్మించిన పోర్చుగల్‌లోని 'మదీరా' దీవిలోనే హెన్రిక్స్ జన్మించాడు. చిన్నతనంలో కుటుంబంతో కలిసి ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరఫున 4 టెస్టులు, 16 వన్డేలు, 24 టీ20 మ్యాచ్‌లు ఆడాడు మోసెస్ హెన్రిక్స్. న్యూ సౌత్ వేల్స్, బిగ్ బాష్ లీగ్‌లో సిడ్నీ సిక్సర్స్ తరఫున ఆడాడు. అంతేకాకుండా సిడ్నీ సిక్సర్స్ జట్టుకు వరుసగా 2019-20, 2020-21 సీజన్లలో కెప్టెన్‌గా టైటిళ్లు సాధించి పెట్టాడు. 2021లో బంగ్లాదేశ్‌తో ఆసీస్ తరఫున తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. మూడేళ్ల కూలింగ్-ఆఫ్ పీరియడ్ పూర్తి చేసుకుని పోర్చుగల్ తరఫున ఆడే అర్హత సాధించాడు. గత నెలలోనే ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన 39 ఏళ్ల హెన్రిక్స్, తన జన్మభూమి అయిన పోర్చుగల్‌కు ఆడాలనే నిర్ణయాన్ని వెల్లడించాడు. అయితే కేవలం ఆటగాడిగానే కాకుండా బోర్డు అతనికి ఏకంగా జట్టు నాయకత్వ పగ్గాలను అప్పగించింది. ఐసీసీ నిబంధనల ప్రకారం ఈ టోర్నీ ఫైనల్ గెలిచిన జట్టు యూరోపియన్ రీజినల్ క్వాలిఫయర్ రౌండ్‌కు చేరుకుంటుంది. అక్కడ స్కాట్లాండ్, జెర్సీ, డెన్మార్క్ వంటి బలమైన జట్లతో పోటీపడి టాప్-2లో నిలిస్తే గ్లోబల్ క్వాలిఫయర్ ద్వారా 2028లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వేదికలుగా జరగబోయే ప్రధాన టీ20 వరల్డ్ కప్‌నకు పోర్చుగల్ అర్హత సాధించవచ్చు. బిగ్‌బాష్ లీగ్, ఐపీఎల్, అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష అనుభవం ఉన్న మోసెస్ హెన్రిక్స్ సారథ్యంలో అసోసియేట్ దేశమైన పోర్చుగల్ క్రికెట్ ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# భారత్-అఫ్గాన్ టీ20 షెడ్యూల్ విడుదల

భారత్, అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య మరో రసవత్తర సమరానికి రంగం సిద్ధమైంది. అఫ్గానిస్థాన్ హోస్ట్ చేసే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఢిల్లీలోని ప్రతిష్టాత్మక అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమివ్వనుందని అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు, బీసీసీఐ సంయుక్తంగా వెల్లడించాయి. సెప్టెంబర్ 13న తొలి టీ20, సెప్టెంబర్ 15న రెండో టీ20, సెప్టెంబర్ 17న మూడో టీ20 మ్యాచ్‌లు ఒకే వేదికపై జరగనున్నాయి. అఫ్గానిస్థాన్ తమ స్వదేశీ సిరీస్‌లను భారత్, యూఏఈలలో ఆడుతున్న నేపథ్యంలో, ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు భారత్‌నే హోస్ట్ వేదికగా ఎంచుకుంది. అఫ్గానిస్థాన్‌లో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తెలిపారు. నాణ్యమైన ప్రత్యర్థి జట్లతో ద్వైపాక్షిక మ్యాచ్‌లు ఆడటం వల్ల అఫ్గాన్ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో విలువైన అనుభవం లభిస్తుందని పేర్కొన్నారు. భారత అభిమానుల్లో అఫ్గాన్ ఆటగాళ్లకు ఉన్న ఆదరణ ఇరు దేశాల క్రికెట్ అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. 2018లో అఫ్గాన్ తొలి చారిత్రక టెస్టుకు ఆతిథ్యమిచ్చిన భారత్, ఇటీవలే జూన్‌లో టెస్ట్, వన్డే సిరీస్‌లను నిర్వహించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ సిరీస్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఇరు జట్లకు అత్యుత్తమ వసతులు కల్పిస్తామని, ఢిల్లీ క్రికెట్ అభిమానులకు ఈ మూడు టీ20 మ్యాచ్‌లు సరికొత్త వినోదాన్ని అందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సిరీస్ అఫ్గానిస్థాన్ క్రికెట్‌కు ఎంతో కీలకమని ఏసీబీ చైర్మన్ మిర్వైస్ అష్రఫ్ పేర్కొన్నారు. బీసీసీఐతో ఉన్న దీర్ఘకాలిక సంబంధాల్లో ఇది మరో కీలక ముందడుగు అని, భారత్ వేదికగా ఈ సిరీస్ నిర్వహించడం ద్వారా వాణిజ్య, సాంకేతిక, క్రీడా రంగాల్లో తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కాగా బీసీసీఐ, ఏసీబీ ప్రకటనతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు షాక్ తగిలినట్లయింది. ఎందుకంటే ఆ దేశ క్రికెట్ బోర్డు.. తమతో సిరీస్ ఆడేందుకు భారత్.. బంగ్లాదేశ్ వస్తుందని ఆశలు పెట్టుకుంది. కానీ తాజా షెడ్యూల్ ప్రకటన చూస్తే.. బంగ్లాదేశ్ పర్యటనకు తాము వెళ్లడం లేదని బీసీసీఐ చెప్పేసినట్లయింది.




# దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

● భారత దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్



దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని భారత దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ అన్నాడు. దేశవాళీ క్రికెట్ ఆడని భారత ఆటగాళ్ల పట్ల బీసీసీఐ కఠినంగా వ్యవహరించాలని సూచించాడు. గత రెండేళ్లుగా స్పిన్ బౌలింగ్ ఎదుర్కోవడంలో టీమిండియా తడబడుతోంది. ముఖ్యంగా యువ ఆటగాళ్ల సామర్థ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడలేకనే టీమిండియా సొంతగడ్డపై న్యూజిలాండ్, సౌతాఫ్రికా చేతుల్లో క్లీన్ స్వీప్ అయ్యింది. అయితే టెస్ట్‌ల్లో టీమిండియా ఘోర వైఫల్యానికి స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడలేకపోవడమే ప్రధాన కారణమని కపిల్ దేవ్ అన్నాడు. అగ్రశ్రేణి ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్‌కు దూరంగా ఉండటంతోనే స్పిన్ బౌలింగ్‌ను సరిగ్గా ఆడలేకపోతున్నారని అభిప్రాయపడ్డాడు. 'దేశవాళీ క్రికెట్ ఆడటం చాలా ముఖ్యం. టాప్ క్లాస్ ప్లేయర్లు తగినంతగా దేశవాళీ క్రికెట్ ఆడకపోవడం వల్లే భారత జట్లు స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతున్నాయి. ఈ విషయంలో బీసీసీఐ కఠినంగా వ్యవహరించి అందరూ దేశవాళీ రెడ్ బాల్ క్రికెట్ ఆడేలా చూడాలి. దాంతో టాప్ క్లాస్ ఆటగాళ్ల నుంచి ఎంతో నేర్చుకునే అవకాశం కుర్రాళ్లకు లభిస్తోంది. ఈ మధ్య భారత్ ఎక్కువగా టీ20లు, వన్డేలు ఆడుతోంది. టెస్ట్ క్రికెట్ పూర్తిగా భిన్నమైనది. ఈ సమస్యను అధిగమించడానికి ఒక పరిష్కార మార్గాన్ని కనుగొనాలి. టీ20 మ్యాచ్‌లు పెరిగినందున పేసర్లు గాయాల బారిన పడకుండా వారి వర్క్‌లోడ్‌పై బీసీసీఐ ఫోకస్ పెట్టాలి.'అని సూచించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లింది. ఆగస్ట్ 15 నుంచి ఈ సిరీస్ మొదలవ్వనుంది. గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను టీమిండియా 2-0తో క్లీన్ స్వీప్ చేయాలి.

# ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి హార్దిక్ పాండ్యా



ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ హాట్ టాపిక్‌గా మారింది. హార్దిక్ ట్రేడింగ్ గురించి పూటకో వార్త తెరపైకి వస్తుంది. పేలవ ప్రదర్శన నేపథ్యంలో ముంబై ఇండియన్స్‌ను వీడేందుకు హార్దిక్ పాండ్యా సిద్ధమవ్వగా.. అతన్ని తీసుకునేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపిస్తున్నాయి. మరోవైపు హార్దిక్ పాండ్యాను అడ్డుపెట్టుకొని తమకు కావాల్సిన ఆటగాళ్ల కోసం ఆయా ఫ్రాంచైజీలతో ముంబై ఇండియన్స్ సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో రోజుకో ఫ్రాంచైజీలో హార్దిక్ పాండ్యా చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముందుగా చెన్నై సూపర్ కింగ్స్‌తో హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్స్ జరిపిన ముంబై ఇండియన్స్ ఆ తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్, కేకేఆర్‌తో చర్చలు జరిపినట్లు ప్రచారం జరిగింది. హార్దిక్ పాండ్యా తన పాత ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించాడని, అతన్ని తీసుకునేందుకు ఆఫ్రాంచైజీ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. కానీ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ అడగడంతో అతని ట్రేడ్ డీల్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి చేరేందుకు హార్దిక్ పాండ్యా సిద్ధమయ్యాడని సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. ఎక్స్ వేదికగా హార్దిక్ పాండ్యా ఫొటోను ఢిల్లీ క్యాపిటల్స్ షేర్ చేయడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. గాయంతో భారత జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా.. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సీఓఈలో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి కష్టపడుతున్నాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టు ఆల్‌రౌండర్ మిన్ను మణి కూడా సీఓఈలోనే రిహాబిలిటేషన్ తీసుకుంటుంది.

# సూర్యకుమార్ యాదవ్‌పై కన్నేసిన ఫ్రాంచైజీలు

టీమిండియా మాజీ టీ20 కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఆ జట్టును వీడనున్నాడనే వార్తలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పేలవ ఫామ్‌తో టీమిండియా టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కోల్పోయిన సూర్యను వదులుకునేందుకు ముంబై సిద్ధమైందని వార్తలు వచ్చాయి. అతన్ని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసేందుకు ముంబై ప్రయత్నించినట్లు కూడా ప్రచారం జరిగింది. సూర్య నిష్క్రమణపై ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినప్పటికీ.. అతను జట్టును వీడటం ఖాయమనిపిస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సూర్యకుమార్ యాదవ్ పేలవ ప్రదర్శన ముంబై ఇండియన్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. 13 మ్యాచ్‌ల్లో సూర్య రెండు హాఫ్ సెంచరీలతో 270 పరుగులే చేశాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేసిన సూర్య ఆ జోరును కొనసాగించలేకపోయాడు. అంతేకాకుండా గత ఏడాదిన్నరగా సూర్య.. అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా విఫలమయ్యాడు. పేలవ ప్రదర్శనతో చివరకు కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయాడు. ఈ క్రమంలోనే అతన్ని వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ సిద్ధమైందనే వాదన వినిపిస్తోంది. అయితే సూర్యను ముంబై వదిలేస్తే అతన్ని తీసుకునేందుకు మూడు ఫ్రాంచైజీలు రెడీగా ఉన్నాయి. సూర్యకుమార్ యాదవ్‌ను తీసుకునే ఫ్రాంచైజీల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ముందు వరుసలో ఉంది. ప్రస్తుతం సూర్య ఫామ్‌లో లేకపోయినా అతని అనుభవం, టీ20 ఫార్మాట్‌కు సరిగ్గా సరిపోయే బ్యాటింగ్ శైలి జట్టుకు ఉపయోగపడుతుందని కేకేఆర్ భావిస్తోంది. అంతేకాకుండా కేకేఆర్‌కు కెప్టెన్ అవసరం ఉంది. సూర్యను తీసుకుంటే కెప్టెన్సీతో పాటు మిడిలార్డర్ బ్యాటర్ లోటును తీర్చుకోవచ్చని భావిస్తోంది. అవసరమైతే సూర్య కోసం ముంబైతో కేకేఆర్ ట్రేడ్ డీల్స్ జరపనుంది. వేలంలోకి వచ్చినా కోట్ల రూపయాలను కుమ్మరించనుంది. సూర్యకుమార్ యాదవ్ కోసం లక్నో సూపర్ జెయింట్స్ కూడా పోటీపడనుంది. అయితే అతని కోసం తమ స్టార్ ఆటగాళ్లను వదులుకునేందుకు లక్నో సిద్ధంగా లేదు. ఈ క్రమంలోనే ముంబైతో ట్రేడ్ డీల్‌కు నిరాకరించినట్లు తెలుస్తోంది. ఒకవేళ సూర్య వేలంలోకి వస్తే అతన్ని కొనుగోలు చేసే ప్రయత్నం చేయనుంది. ఎందుకంటే లక్నోకు కూడా కెప్టెన్సీతో పాటు ఓ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఉంది. సూర్య కోసం రాజస్థాన్ రాయల్స్ కూడా పోటీ పడనుంది. అవసరమైతే ముంబై ఇండియన్స్‌తో ట్రేడ్ డీల్‌కు ప్రయత్నాలు కూడా చేయవచ్చు. సూర్య కోసం యశస్వి జైస్వాల్‌ను కూడా వదులుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ సిద్ధంగా ఉంది. టాప్ క్లాస్ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఆ జట్టుకు ఉంది. అంతకంటే అనుభవం కలిగిన సారథి ఆ జట్టుకు కావాలి. సూర్య రాకతో ఈ రెండు సమస్యలను అధిగమించవచ్చని రాజస్థాన్ రాయల్స్ భావిస్తోంది.





# ఇక సినిమాల్లో అవకాశాలు రావనుకున్నా

## నటి సమంత

నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీ సిరీస్‌లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా. హీరోయిన్స్ కూడా అన్ని చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.

# అసభ్యకరమైన పోస్టులు తొలగించండి

## జాన్వీ కపూర్ పిటిషన్‌పై కోర్టు ఆదేశం

ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, ఎఐ ద్వారా సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఆమె తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. అయితే ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూప్ జైరామ్ భంభాని కీలక ఆదేశాలు జారీ చేశారు. అసభ్యకరంగా ఉన్న కంటెంట్‌ను, అలాగే ఎవరైనా ఆమె పేరును వాణిజ్యపరంగా దుర్వినియోగం చేస్తుంటే ఆ పోస్టులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పర్సనాలిటీ రైట్స్ అనే భావనకు ఒక సరైన హద్దు ఉండాలని, సెలబ్రిటీల హక్కులను రక్షించడంతోపాటు భావప్రకటన స్వేచ్ఛను కూడా సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అన్ని ఫ్యాన్ పేజీలపై ఒకేసారి నిషేధం విధించలేమని కోర్టు పేర్కొంది. కేవలం వాణిజ్య ప్రయోజనాల కోసం లేదా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఎవరైనా ఆమె పేరును వాడుకుంటేనే కచ్చితంగా చర్యలు తీసుకోవచ్చునని, అయితే అన్ని ఫ్యాన్ పేజీలను నేరపూరితమైనవిగా పరిగణించలేమని తెలిపారు. కొందరు వ్యంగ్యంగా లేదా విమర్శనాత్మక ధోరణిలో కూడా పోస్టులు చేసే అవకాశం ఉందని న్యాయమూర్తి గుర్తుచేశారు. ఈ కేసులో మెటా తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తరఫున ఇప్పటికే 4,000కు పైగా యూఆర్ఎల్‌లను సమర్పించారని, అయితే ఆ కంటెంట్ అంతా ఒకేలా అభ్యంతరకరంగా లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో, ఆరోపణలు ఎదుర్కొంటున్న కంటెంట్‌ను స్పష్టమైన వర్గాలుగా విభజించి తదుపరి విచారణకు కోర్టు ముందుంచాలని పిటిషనర్ తరపు న్యాయవాదిని న్యాయమూర్తి ఆదేశించారు. గతంలో కూడా పలువురు ప్రముఖ నటీనటులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.




# కిమ్స్ ఆసుపత్రిలో ఎన్టీఆర్‌కు విజయవంతంగా సర్జరీ పూర్తి

టాలీవుడ్ అగ్రహీరో జూనియర్ ఎన్టీఆర్‌కు బుధవారం నాడు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగింది. ఆయన భుజానికి వైద్యులు విజయవంతంగా ఆర్థోస్కోపిక్ సర్జరీని నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రస్తుతం ఆయన ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులెటిన్ ద్వారా వెల్లడించాయి. ఇటీవల జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న సమయంలో ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆ సమయంలో వైద్యులు ఆయనకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయితే, గాయం నుంచి వేగంగా, పూర్తిగా కోలుకోవాలంటే శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సిఫార్సు చేయడంతో నేడు ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స నుంచి ఎన్టీఆర్ పూర్తిగా కోలుకుని, తిరిగి తన వృత్తిపరమైన పనుల్లో నిమగ్నం కావడానికి సుమారు రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు.



# 4న వస్తోన్న క్రైమ్ థ్రిల్లర్ మిర్జాపూర్ మూవీ




భారతీయ ఓటీటీ చరిత్రలో సంచలనం సృష్టించడంతో పాటు అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించేందుకు సిద్ధమైంది. అమెజాన్ ఎమ్‌జీఎం స్టూడియోస్ మరియు ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రితేష్ సిధ్వాని, ఫర్హాన్ అక్తర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి గుర్‌మీత్ సింగ్ దర్శకత్వం వహిస్తుండగా, సిరీస్‌లో అదరగొట్టిన ప్రధాన నటీనటులందరూ మళ్లీ పెద్ద తెరపై తమ విశ్వరూపం చూపించడానికి వస్తున్నారు. 'సింహాసనం అనేది రాజకీయాల ద్వారా రాదు, అలా అని వంశపారంపర్యంగానూ రాదు? కేవలం బాహుబలం ఉంటేనే సింహాసనం దక్కుతుంది అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ ఆకట్టుకుంటుంది. ఓటీటీలో వెబ్ సిరీస్‌గా ప్రేక్షకులను అలరించిన ఈ నేర ప్రపంచాన్ని, మరింత భారీ హంగులతో, అత్యున్నత నిర్మాణ విలువలతో వెండితెర కోసం మలిచారు. గతంలో సిరీస్‌లో మరణించినట్లు చూపించిన మున్నా భయ్యా (దివ్యేందు) పాత్ర ఈ చిత్రంలో మళ్లీ రీఎంట్రీ ఇస్తుండటం అభిమానులకు అసలైన విందుగా మారనుంది. ఇక మిర్జాపూర్ సింహాసనం కోసం జరిగే పోరులో కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డూ పండిట్ (అలీ ఫజల్) మరియు మున్నా భయ్యా మధ్య జరిగే రక్తపాతంతో కూడిన పోరాటం ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందులతో పాటు శ్వేతా త్రిపాఠి, రసికా దుగ్గల్, అభిషేక్ బెనర్జీ, జితేంద్ర కుమార్, రవి కిషన్ మరియు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# మరోసారి 'చిరు లీక్స్'...


## తన 158వ సినిమా టైటిల్ చెప్పేసిన మెగాస్టార్!



మెగాస్టార్ చిరంజీవి తన రాబోయే సినిమాకు సంబంధించిన కీలకమైన విషయాన్ని అనుకోకుండా బయటపెట్టారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' సక్సెస్ మీట్‌లో తన 158వ సినిమా టైటిల్‌ను ఆయనే స్వయంగా లీక్ చేశారు. దీంతో చజప్త్రఱతీబూఘుఎం అనే హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో మరోసారి వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. కేఎస్ రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో చిరంజీవి తన 158వ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి 'కదిరి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని చిరంజీవి సరదాగా వేదికపై వెల్లడించారు. ఈవెంట్‌లో లీక్‌ల గురించి ప్రస్తావన రాగా, సంగీత దర్శకుడు తమన్ వద్దని వారిస్తున్నా, "టీజర్ మ్యూజిక్ అయ్యిందా? చివర్లో 'కదిరి' అని టైటిల్ పెట్టారా?" అని చిరంజీవి అడగడంతో అసలు విషయం బయటపడింది. అంతేకాదు తన పుట్టినరోజు కానుకగా ఆగస్టు 22న ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు కూడా ప్రకటించారు. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి-బాబీ కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలున్నాయి. ఈ చిత్రంలో చిరంజీవి సరసన ప్రియమణి కథానాయికగా నటిస్తుండగా, కన్నడ నటి రచితా రామ్, నివేదా పేతురాజ్, అనశ్వర రాజన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కే నారాయణ, లోకేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

# ఇరుముడి ట్రైలర్ రిలీజ్..

మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నారు.. చివరిగా ఆయన నటించిన మాస్ జాతర, భర్త మహాశయులకు విజ్ఞప్తి ఈ రెండు చిత్రాలు కూడా ఆయనకు పెద్దగా విజయాన్ని అందించలేదు. దీంతో ఆయన ఖాతాలో హిట్ అనివార్యమైంది. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా మంచి సక్సెస్ అందుకోవాలని చూస్తున్న రవితేజ ఏకంగా జానర్ మార్చి 'ఇరుముడి' అనే టైటిల్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆగస్టు 21న ఈ సినిమా విడుదల కాబోతోంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం అప్పుడే ప్రమోషనల్ కార్యక్రమాలు మొదలుపెట్టింది. పైగా సినిమా నుండి ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాండ్ లభించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు. అయ్యప్ప మాలలో ప్రేక్షకులకు ఈసారి మంచి వినోదాన్ని పంచడానికి సిద్ధమైన రవితేజ.. ఈ ట్రైలర్ తో సినిమాపై అంచనాలు పెంచేశారు. తాజాగా విడుదల చేసిన ట్రైలర్లో భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ మేళవింపుగా దీనిని తీర్చిదిద్దినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది.




# గతంలో జరిగిన తప్పులకు క్షమించండి

## డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లో జానీమాస్టర్



తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార వేడుకలో ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్‌తో తలెత్తిన విభేదాలు మరియు వివాదాల పట్ల జానీ మాస్టర్ బహిరంగంగా క్షమాపణలు కోరారు. గత కాలపు పొరపాట్లను పక్కనపెట్టి మళ్లీ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించుకున్నామని, కొంతకాలం అసోసియేషన్‌కు దూరంగా ఉన్నప్పటికీ మళ్లీ అందరితో కలిసి పనిచేసేందుకు వచ్చానని ఆయన స్పష్టం చేశారు. ఇకపై అందరం ఒకే కుటుంబంలా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిర్మాతలు ఇచ్చే పారితోషికాలు డ్యాన్సర్లకు పూర్తిగా అందడం లేదనే తీవ్ర ఆవేదనతోనే గతంలో తాను మాట్లాడాల్సి వచ్చిందని ఆయన వెల్లడించారు. ఇదే అంశంపై మెగాస్టార్ చిరంజీవిని కలిసినప్పుడు, ఆయన ఎంతో సానుకూలంగా స్పందించి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో తన మాటల ద్వారా ఎవరికైనా మనస్తాపం కలిగి ఉంటే, లేదా తెలిసీ తెలియక ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే పెద్ద మనసుతో క్షమించాలని ఇండస్ట్రీ పెద్దలను జానీ మాస్టర్ కోరారు. తండ్రి కోప్పడినా చివరికి పిల్లలను దగ్గరకు తీసుకున్నట్లే, సినీ పరిశ్రమ పెద్దలు మరియు నిర్మాతల మండలి డ్యాన్సర్ల అసోసియేషన్‌ను కలుపుకొని ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.